ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 18 నవంబరు 2025



అద్దంకిలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు నారాయణ, రవికుమార్

అద్దంకి పట్టణాభివృద్ధికి పూర్తి సహకారం

- అమృత్ 2.0 ద్వారా రూ.111 కోట్లు మంజూరు
- మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- మంత్రి గొట్టిపాటితో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణ

అద్దంకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. సోమవారం పట్టణంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఆయన సుమారు రూ.12.40 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. అద్దంకి పట్టణానికి నిధులు కేటాయింపుపై ఏడాదిన్నర కాలంలో మంత్రి రవికుమార్ కనీసం వందసార్లు ప్రస్తావించారని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరాకు.. రూ.111 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఊరచెరువు అభివృద్ధికి రూ.6 కోట్లు, మినీ బైపాస్‌కు రూ.15 కోట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వేసిన చెత్తను డంపింగ్ యార్డు నుంచి తొలగించి.. అద్దంకి మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరతగతిన పూర్తిచేసి.. అన్ని మౌలిక వసతులతో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అద్దంకి పట్టణాభివృద్ధికి ఇప్పటికే మంత్రి నారాయణ రూ.7.50 కోట్లు మంజూరు చేశారని, మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి రవికుమార్ కోరారు. మినీ బైపాస్ నిర్వాసితులైన 60 కుటుంబాలకు శింగరకొండ వద్ద మౌలిక వసతులు కల్పించి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నామ్ రోడ్డులో ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చడం జరుగుతుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. రెండు విడతల్లో మినీ బైపాస్ నిర్మాణం పూర్తవుతుందన్నారు.

వేడుకగా ప్రారంభోత్సవాలు..

ముందుగా ద్వారకా నగర్‌లో రూ.4.5 కోట్లతో చేపట్టిన 33 కేవీ సబ్‌స్టేషన్, మొండితోకపాలెంలో రూ.7.50 కోట్ల నిధులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాలను మంత్రులు ఆవిష్కరించారు. పాత పసుమర్తిపాలెంలో కమ్యూనిటీ భవనం, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. 230 మంది కళాశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. 60 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.50 లక్షల నగదు చెక్కును అందజేశారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, మెప్మా పీడీ సత్యానంద పాల్, విద్యుత్ ఎస్ఈ అంజనేయులు, ఈఈ మస్తాన్‌రావు, కమిషనర్ రవీంద్ర, నేతలు చిన్ని శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు, నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న మంత్రులు నారాయణ, రవికుమార్

నిర్ణీత కాల పరిమితిలో అర్జీలు పరిష్కరించాలి

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను చట్ట పరిధిలో.. నిర్ణీత కాల పరిమితిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ఎస్పీకి వివరించారు. ఎస్పీ సంబంధిత పోలీసు స్టేషన్ల హెచ్‌వోలతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. 63 మంది అర్జీదారులు సమస్యలను ఎస్పీకి వివరించారు. డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు, ఎస్ఐ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

పరిపూర్ణం.. భక్తిపారవశ్యం!



గుంటూరులో దీపారాధన చేస్తున్న మహిళ




అమరావతి అమరేశ్వరాలయంలో కోటి దీపోత్సవం

కార్తిక మాసం చివరి సోమవారం శైవక్షేత్రాలు భక్త జన సంద్రంగా మారాయి. పవిత్ర మాసాంతం.. నియమ నిష్టలతో ఉన్న భక్తులు ఆలయాలకు భారీగా పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించి.. భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీప నైవేద్యం సమర్పించి.. ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం పఠిస్తూ.. మనసారా స్వామిని దర్శించుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి.. మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ప్రథమ ఆరామం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయానికి రాష్ట్ర నలుమూల నుంచి భారీ గా భక్తులు చేరుకున్నారు. కార్తిక దీపాల కాంతిలో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలకంరణ సేవ చేశారు.

- నరసరావుపేట, అమరావతి, పెదకాకాని





ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు, అమరావతి అమరేశ్వరుడు



పెదకాకాని శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు



అమరావతి వద్ద కృష్ణానదిలో భక్తుల పుణ్య స్నానాలు



భక్తులతో కిక్కిరిసిన సూర్యలంక తీరం



వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి

నల్ల బర్లీ రైతులను ఆదుకోవాలి

పర్చూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌తో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. సోమవారం సచివాలయంలో ఆయనను కలసి నల్లబర్లీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకు తాలూకా పెండింగ్ బకాయిని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల వద్ద పెద్ద ఎత్తున నిల్వ ఉన్న పొగాకు ఇటీవల వరదల కారణంగా తడిచిపోవడం, కొనుగోలులో జాప్యం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని సెక్రటరీ దృష్టికి తెచ్చారు. రైతుల వద్ద మిగులు నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి సేకరించేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రక్రియలో పాల్గొన్న ఉద్యోగుల జీతాలు, గోదాముల అద్దె బకాయిల చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భేటీ అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేసిందన్నారు. రైతు సంక్షేమమే ప్రజా కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు.

అధికారులంతా ఐడీ కార్డు ధరించాలి

ఇక పనిదినాల్లో విజిటింగ్ అవర్ • కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ ఐడీ కార్డు ధరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. దీంతో అధికారులను గుర్తించడానికి ప్రజలకు వీలవుతుందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విచ్చేసిన అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పని దినాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విజిటింగ్ అవర్ ఉంటుందన్నారు. ఈ సమయంలో ప్రజలు, అధికారులు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. ఇలాగే ప్రతి కార్యాలయంలో విజిటింగ్ అవర్స్ నిర్వహించా లన్నారు. అధికారులంతా చిత్తశుద్ధితో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు బాపట్ల రెడ్‌క్రాస్, కలెక్టరేట్ ద్వారా ఉచితంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనం పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. భోజన పదార్థాలను పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడారు.



అర్జీదారులతో భోజన రుచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ

స్త్రీశిశు సంక్షేమశాఖ రూపొందించిన మిషన్ వాత్సల్య పథకం గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ పథకం కింద ఏటా నవంబరులో దత్తత మాసోత్సవాలు జరుగుతాయన్నారు. గతంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా దత్తత ప్రక్రియ నిర్వహిస్తుండగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) ద్వారా ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. అనాథ శిశువులకు శిశుగృహంలో ఆశ్రయం కల్పించి.. వారి దత్తతను చట్టబద్ధంగా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో.. జేసీ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైరన్ బి.ఎస్.నారాయణభట్టు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వసతిపై.. వీడిన గ్రహణం

నెల రోజుల్లో పనులు ప్రారంభం

పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో ఉన్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు 1,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి వసతి లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు తుది దశలో నిలిచిపోయాయి. దాదాపు ఏడాదిన్నరగా వర్సిటీ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వసతి గృహాల నిర్మాణానికి ఈసీ సమావేశంలో రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. బాలికల వసతి గృహం ప్రహరీకి రూ.1.10 కోట్లు, రహదారుల అభివృద్ధి, ప్రధాన గేటు ఏర్పాటు వంటి పనులకు రూ.8.50 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. దీంతో నెల రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. కళాశాల భవనంలో మరో ఫ్లోర్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు గతంలో రూ.31.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ నిర్వహించాల్సి ఉంది. రూ.16 కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులు చేపట్టగా ఇవి నత్తనడకన సాగు తున్నాయి. అలాగే కళాశాలలో అధ్యాపకుల కొరతపై చర్యలు చేపట్టనున్నారు. కాంట్రాక్ట్ విధానంలో అధ్యాపకులను నియ మించాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి వేగవంతం చేస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరుతాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఎట్టకేలకు వర్సిటీ పాలక మండలి సమావేశం
- రూ.19.60 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం
- పూర్తికానున్న ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు కాకినాడ జేఎన్‌టీయూలో పాలక మండలి సమావేశం జరిగింది. ఇందులో నరసరావుపేట కళాశాల అభివృద్ధిపై చర్చించారు. వీసీ సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. నిధుల కొరతతో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రూ.19.60 కోట్ల నిధులు విడుదలకు సమావేశంలో తీర్మానించినట్లు సమాచారం. నిధుల కొరతతో కాంట్రాక్టర్లు వసతి గృహాల నిర్మాణ పనులు నిలిపివేశారు. దీనిపై.. వీసీ హామీ హుళక్కి... శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించి.. పాలకమండలి సమావేశం నిర్వహించి.. నిధుల కేటాయింపుపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకున్నారు.



బాలికల వసతి గృహ భవనాలు

సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ 6

ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూలో ఆటల పోటీలు

వెలలేనివి వీరి సేవలు

● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు 8

రైతుల ఇక్కట్లు తీరేదెన్నడు?

తీరని చావలి పెద్ద కాల్వ డొంక దారి సమస్య



వేమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తుల రవాణాకు, సాగు భూముల్లోకి వెళ్లేందుకు ప్రధాన మార్గమైన చావలి పెద్ద కాల్వ డొంక అభివృద్ధికి అడుగులు పడడం లేదు. ఈ మార్గంలో ఆరు దశాబ్దాలుగా తాము పడుతున్న ఇబ్బందులను.. 250 ఎకరాలకు చెందిన రైతులు లిఖిత పూర్వకంగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి స్పందనా కనిపించడం లేదు. చావలి గ్రామ రైతు సోమరౌతు వెంకట సుబ్బారావు జనవరిలో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించడంతో.. ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. దీంతో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ రైతు వెంకట సుబ్బారావును తన కార్యాలయానికి పిలిపించి డొంక సమస్యపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాలతో సమస్య పరిష్కారానికి ఈ నెల 7న సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేశారు. కార్యదర్శి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ఆదేశాలను గ్రామస్తులకు వివరించారు. చావలి పంచాయతీ పరిధిలో 1,083 మీటర్లు, పెరవలి పంచాయతీ పరిధిలో 2,474 మీటర్ల దూరం ఈ డొంక మార్గం ఉందని.. చావలి పంచాయతీ పరిధిలో మాత్రమే అభివృద్ధికి నిర్ణయం తీసుకోగలుతామని వివరించారు. దీంతో స్పందించిన రైతులు మూడు కిలోమీటర్ల డొంక మార్గం పూర్తిగా బాగు చేయాలని కోరారు. పెరవలి పంచాయతీలో కూడా డొంక అభివృద్ధికి కూడా.. సభ ద్వారా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ సూచనల మేరకు కార్యదర్శి సభ్యుల ఏకగ్రీవ తీర్మానం కలెక్టర్‌కు పంపారు. డొంక నిర్మాణానికి ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.1.10 కోట్ల అంచనాతో ప్రతిపాదన చేశారు.

సీసీఐ పత్తిబంధకాలు

ఎన్ని విజ్ఞప్తులు చేసినా..

ఏపీలో పత్తి రైతులను ఆదుకునేందుకు.. తేమ శాతంలో మార్పులు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కేంద్రానికి లేఖ రాశారు. గత వారం గుంటూరు జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదు.



కొనుగోలు కేంద్రాల్లో పాస్‌కాని పత్తి

- సీసీఐ నిబంధనలతో బయ్యర్ల తిరస్కరణ
- బయట దళారులకు రూ.5 వేలకే విక్రయం
- వాతావరణ మార్పులతో రైతుకు తప్పని కంట'తడి'
- తేమశాతం పెంచితేనే.. కర్షకులకు ప్రయోజనం

పత్తి రైతులకు సాగు మొదలకుని.. కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయం వరకు కంటతడి తప్పడం లేదు. సాగు సమయంలో పంటపై ప్రకృతి పగబడితే.. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిబంధనలు మద్దతు ధర పొందడానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. తేమ శాతం అధికంగా ఉందని కొనుగులు కేంద్రాలకు వచ్చిన పత్తి పంటను బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో కేంద్రాలు ఆరంభించి అధికారికంగా పది రోజులు దాటినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టుమని పది కేజీల పత్తి కూడా కొన్న దాఖలాలు కనిపించడం లేదు. సీసీఐ నిబంధనల మూలాన రైతులు కేంద్రాలకు తెస్తున్న పత్తి పాస్ అవ్వడం లేదు.

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి తీత జోరుగా సాగుతోంది. మొన్నటి దాకా తుఫాన్ ప్రభావంతో పత్తిలో నెమ్ము ఎక్కువగా కనిపించింది. ఇప్పుడు వాతావరణం పూర్తిగా మారిపోయి పగటి వేళ కూడా చల్ల గాలులు వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో రైతులు హడావిడిగా పత్తి తీయిస్తున్నా.. పంటలో తేమ శాతం 18 నుంచి 22 వరకు ఉన్నట్లు తేలుతోంది. సీసీఐ నిబంధనలు ప్రకారం తేమ శాతం 8 నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి.

దళారుల పంట పండుతోంది..

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దే దళారుల పంట పండుతోంది. కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం చూసిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

మెరుగైన సేవలే ఏపీ గ్రామీణ బ్యాంకు లక్ష్యం

● చైర్మన్ కే ప్రమోద్‌కుమార్ రెడ్డి ● కర్లపాలెంలో నూతన కార్యాలయం ప్రారంభం



డ్వాక్రా మహిళలకు రూ.2కోట్ల చెక్కును అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

కర్లపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రూ.128 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ బ్యాంకు లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కర్లపాలెంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ బి.రామకృష్ణ, రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ళ శ్రీనివాస్, ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎంఎం.భాస్కర్‌రావుతో కలిసి సోమవారం ప్రమోద్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ ఆర్.అన్వరసన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాష్ట్రంలో 1,351 శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తోందన్నారు. ప్రభుత్వ రంగంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్ రాష్ట్రంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు దీటుగా ఆంధ్రప్రదేశ గ్రామీణబ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. అనంతరం మేనేజర్, సిబ్బంది రూమ్‌లను, లాకర్‌లను ప్రారంభించారు. డ్వాక్రా మహిళలకు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. కర్లపాలెం చైతన్యగ్రామీణా బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత మేనేజర్‌లు వెంకన్నచౌదరి, ఏసుపాదం, విద్యాసాగర్, మద్దుల సత్యనారాయణ, భవన యజమాని మంతెన సత్యనారాయణరాజును చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కెసాని మానసా, ఖాతాదారులు దుండి చలపతి రెడ్డి, పిట్టు మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో ఆటల పోటీలు



క్రీడా కారులతో ఫార్మసీ అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ప్రతి సంవత్సరం నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్-ఫార్మసిస్ట్ యాజ్ ఎడ్వకేట్స్ ఆఫ్ వాక్సినేషన్ అనే థీమ్‌తో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. వారం రోజులపాటు ఈ పోటీలు జరగనున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ షేక్.మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, దివ్య భార్గవి, రేణుక పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ యోగ నాలుగో సంవత్సరం ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ రావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ పెట్టుకోదలచిన వారు ఒక్కొక్క పేపర్‌కు రూ.1860 చెల్లించి ఈ నెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొంది పరిచామని పేర్కొన్నారు.

సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి కాకినాడ-చెంగల్‌పట్టు/పుదుచ్చేరి మధ్యన రాకపోకలు సాగిస్తోన్న సర్కారు ఎక్స్‌ప్రెస్ సంక్రాంతి పండగ రోజు నుంచి కొత్త రూపును సంతరించుకోబోతోంది. ఇప్పటివరకు ఐసీఎఫ్ బోగీలతో రాకపోకలు సాగిస్తోన్న ఈ రైలు ఇకపై కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనుంది. చెంగల్‌పట్టు నుంచి జనవరి 14వ తేదీన, పుదుచ్చేరి నుంచి జనవరి 15వ తేదీన ఈ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది.

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము-గుంటూరు

ఆర్.సి.నం. 2613/2025/జి4 తేది. 17-11-2025.

షార్ట్ టెండర్ ప్రకటన

జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్, కస్తూరిబా గాంధీ, ఆదర్శ, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ మరియు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి చదువుచూ మార్చి-2026 నందు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్ సరఫరా చేయుటకుగాను ఇంగ్లీషు మీడియంలో 32,276 పుస్తకములు ఎ4 సైజుతో ఇంగ్లీషు మీడియం పుస్తకముల స్పెసిఫికేషన్ మేరకు డి.టి.పి మరియు ప్రింటింగ్ చేయించి జిల్లాలోని 6 ఉప విద్యాశాఖాధికారుల వారీగా వారి వారి కార్యాలయములకు తదుపరి సూచనల మేరకు సొంత ఖర్చులతో సరఫరా చేయుటకుగాను ఆసక్తిగల సరఫరాదారుల నుండి షార్ట్ టెండర్స్ ఈ దిగువ తెలిపిన ప్రకారము ఆహ్వానించడమైనది. 1. టెండర్ షెడ్యూల్ ఖరీదు రు.5,000/-, 2. EMD రూ.1,00,000/-లు, 3. టెండర్ షెడ్యూల్ పొందుటకు చివరి తేది. 25.11.2025 మధ్యాహ్నం గం.12.00ల వరకు., 4. టెండర్ షెడ్యూల్ దాఖలు చేయవలసిన తేది. 25.11.2025 మధ్యాహ్నం గం.1.00 వరకు. 5. టెండర్ షెడ్యూల్ తెరువబడు తేది. 25.11.2025 సాయంత్రం గం.4.00 లకు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం, గుంటూరు. టెండర్ దారుడు టెక్నికల్ బిడ్ నందు అర్హత పొందిన తదుపరి మాత్రమే ఫైనాన్షియల్ బిడ్‌కు అర్హత పొందుదురు. టెండరు పై అంతిమ అధికారము శ్రీయుత ముఖ్యకార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, గుంటూరు వారికి కలదు. ఏ కారణము తెలుపకనే టెండర్స్ తిరస్కరించుట గాని రద్దు పరచుట గాని వారికి పూర్తి అధికారము కలదు. టెండర్ షరతులకు కార్యాలయపు పనిదినములలో "జి కక్ష్య పర్యవేక్షకుల" వారిని సంప్రదించగలరు.

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లాప్రజా పరిషత్, గుంటూరు.

విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు: యరపతినేని



మాచవరంలో కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

మాచవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ప్రపంచస్థాయి సీఐఐ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో పలు కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తపాలెం గ్రామంలో జమ్మిగుంపుల నాగేశ్వరరావు, వర్దనమ్మలు సుమారు రూ.8 లక్షల సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, మాచవరం గ్రామంలో మండల సమాఖ్య పరిధిలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిని ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఆర్థికంగా దిగజారి పోయి విధ్వంస మయిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నా రన్నారు. దీనిలో భాగంగానే విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో సుమారు రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు, ఇతర దేశాలతో ఒప్పందాలు కుదిరాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఏకగ్రీవం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు.

సీఐఐతో మారనున్న పెట్టుబడుల దిశ

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల




సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు నాయుడు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారని, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారని చెప్పారు. ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుంటే ఆంధ్రప్రదేశ్ అందుకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండడంతో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కట్టాయన్నారు. జగన్ మోహన్‌రెడ్డి విధ్వంసక విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్ళిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఏబీసీ వంటి కంపెనీలు తిరిగి రాష్ట్రానికి రావడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, ముంద్రకోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద స్వల్పంగా వరద ఉధృతి

● దిగువకు 400 క్యూసెక్కుల నీటి విడుదల



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 9,938 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,211 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,101 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 586.10 అడుగులు ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,034 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 14,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 14,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.22 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుందని చెప్పారు. పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

ఏఎన్‌యూలో వేతనాల మాయాజాలం

● అతిథి అధ్యాపకుల జీతాల చెల్లింపులో గోల్‌మాల్ ● బ్యాంకు ఉద్యోగులను నిలదీసిన అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల్లో కొందరికి వేతనాలు జమ చేసి, మరికొందరికి జమ చేయకపోవడంపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వేతనాల చెల్లింపుకు సంబంధించిన నగదు చెక్కును ఓ అతిథి అధ్యాపకుడి చేతికి ఇవ్వటంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు అక్టోబరు నెల వేతనాలు చెల్లించేందుకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేకపోయినప్పటికీ ఓ అతిథి అధ్యాపకుడు అకౌంట్స్ విభాగం నుంచి కొంత నగదుతో కూడిన చెక్కును విశ్వవిద్యాలయంలోని యూనియన్ బ్యాంకుకు ఈ నెల 13న తీసుకెళ్లారు. అతిథి అధ్యాపకులందరి వేతనాలకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేనప్పుడు జాబితాను తిరిగి అకౌంట్స్ విభాగానికి పంపాల్సిన యూనియన్ బ్యాంకు ఉద్యోగి ఆ అతిథి అధ్యాపకుడికి జాబితా ఇచ్చి ఎవరెవరికి వేతనాలు వేయాలో నిర్ధారించమన్నట్లు తెలిసింది. దీంతో అతను తనకు అనుకూలంగా ఉండే 30 మంది పేర్లను జాబితాలో చేర్చి ఇవ్వగా, వారందరి అకౌంట్లో బ్యాంకు సిబ్బంది ఈ నెల 13న వేతనాలు జమ చేశారు. మిగతా మెజారిటీ అతిథి అధ్యాపకులకు వేతనాలు సోమవారం మధ్యాహ్నం వరకు జమ కాలేదు. ఈ వేతనాల చెల్లింపు మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సోమవారం అతిథి అధ్యాపకులు యూనియన్ బ్యాంకుకు వెళ్లి ముందుగా ఎంపిక చేసిన వారికి మాత్రమే ఏ నిబంధనల ప్రకారం వేతనాలు జమ చేశారని నిలదీశారు. ఓ అతిథి అధ్యాపకుడి మాట లను ఎలా పరిగణనలోకి తీసుకున్నారంటూ బ్యాంకు సిబ్బందితో పాటు బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించారు. అనంతరం అకౌంట్స్ అధికారిని కలిసి కొంత మందికి మాత్రమే వేతనాల చెల్లింపుల చెక్కును ఎలా రాసి ఇచ్చారని ప్రశ్నించారు. చివరకు రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్‌తో పాటు రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో రెక్టార్ శివరాం ప్రసాద్ ఫైనాన్స్ అధికారిని పిలిచి వేతనాలు జమకాని అతిథి అధ్యాపకులకు వెంటనే జమ చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు బాధ్యతగా బ్యాంకులో అప్పజెప్పాల్సిన నగదు చెక్కును అతిథ్యాపకుడి చేతికి ఎలా ఇచ్చారని, ఇక ముందు అలా ఇవ్వొద్దని హెచ్చరించారు.



రుజువైన రైజింగ్ ఆంధ్రా సత్తా: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన పెట్టుబడుల సునామీతో రైజింగ్ ఆంధ్రా సత్తా మరోసారి రుజువైందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన బ్లూప్రింట్ ఇచ్చిన ఇలాంటి కార్యక్రమంపైన అయిదేళ్లలో పైసా తీసుకురాని వైసీపీ నాయకులు విషం కక్కడం విషాదకరమని మండిపడ్డారు. 12 ప్రధాన రంగాల్లో 13.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డని పేర్కొన్నారు. పెట్టుబడుల సదస్సుతో రాష్ట్ర ఆర్థిక జీవనాడిగా ఉన్న విశాఖకు బలమైన పునాది పడిందని, పెట్టుబడిదారుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం లక్షల కోట్ల పెట్టుబడులేనని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర విధానాలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఇదే వేగంతో కొనసాగితే ఏపీ దేశంలోనే పెట్టుబడులకు నంబర్ వన్ డెస్టినేషన్ అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయల సీమ ప్రాంతాల ప్రత్యేకతలకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి సమతు ల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న ఇరువురిని పెదకాకాని పోలీసులు సోమవారం అదుపులో తీసుకున్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పెదకాకాని భ్రమరాంబపురం కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసులు పథకం ప్రకారం వారిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం

మంగళగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కురగల్లు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందాడు. మంగళగిరి పట్టణానికి చెందిన ఎ.మురళీ (33) ర్యాపిడో బైకు రైడర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మురళీ తన ద్విచక్ర వాహనంపై సోమవారం కురగల్లు నుంచి నిడమర్రు వైపు వెళుతుండగా బైకు అదుపు తప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న టిప్పర్ మురళీ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు మహిళా కూలి మృతి

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన ఒక మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ ఘటన చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జటావతు ప్రియంతి బాయి (26) పత్తి తీత పనికి వెళ్ళింది. పొలంలో పని చేస్తుండగా ఆమె ఎడమ కాలుకు రక్తపింజర కాటు వేసింది. తోటి కూలీలు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రియంతి బాయి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త గణేష్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చినఅగ్రహారంలో మరో వ్యక్తి

పిడుగురాళ్ల: మండలంలోని చినఅగ్రహారం గ్రామానికి చెందిన ఆవుల సాంబశివరావు (42) ఆదివారం గడ్డివాము దగ్గరకు వెళ్లగా పాము కరిచి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పం

● నేడు విట్ వర్సిటీలో కార్యక్రమం ప్రారంభం ● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు "సంకల్పం" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా తొలుత జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం విట్ యూనివర్సిటీ ప్రాంగణంలో గుంటూరు జిల్లా పోలీస్, విట్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో "సంకల్పం" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని కాలేజీల్లో విద్యార్థులతో కలిపి ఈగల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి, పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తాము ప్రారంభిస్తున్న సంకల్పం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

సీసీఐ పత్తిబంధకాలు!

(5వ పేజీ తరువాయి)

బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో బయట అదే పత్తిని దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంటను వెనక్కి తీసుకెళ్తే.. రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని భావించిన రైతులు.. అయినకాడికి పత్తిని అక్కడే తెగ నమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్వింటాల్ పత్తి రూ.5 వేలకు అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అదే పత్తి సీసీఐ కొనుగోలు చేస్తే రైతుకు క్వింటాల్ కు రూ.రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత) లభిస్తుంది. దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర దక్కేది.

జీవోను అమలు చేయడం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 843 ను సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్ సీఎండీకి లేఖ రాశారు. జీవోలోని 23వ నిబంధన ప్రకారం రైతుల పత్తి పంటను ఇష్టం అయిన చోట అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఐ మాత్రం తాము చెప్పిన చోటే అమ్ముకోవాలని చెబుతోంది. దీనిపై ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు సీసీఐ మేనేజర్‌ను కలిసి రైతుల సౌలభ్యం కోసం జీవోను అమలు చేయాలని కోరినా.. పెద్దగా స్పందించకపోవడంతో తో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

37,951 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,942 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,951 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,689 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17600	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	16000	334	10500	17000
273	----	---	నెంబరు. 5	10000	16500
341	10000	17200	341	10500	18000
4884	----	----	4884	11000	14500
సూపర్ 10	---	----	సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18000	దేవనూరు డీలక్స్	10500	17500
దేవనూరు డీలక్స్	10500	17000	తాలుకాయలు	5000	9000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పెట్టుబడుల దిశను మార్చే చారిత్రక వేదికగా విశాఖ సమ్మిట్

● బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల


సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఎంతో వ్యూహాత్మకంగా శ్రమిస్తొన్నారో నిరూపనగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు అన్నారు. ఈ విషయమై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపటంలో చంద్రబాబు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడుప్రాంతాలకు పెట్టుబడులు సమానంగా వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారన్నారు. మొత్తం 613 ఒప్పందాల ద్వారా 13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావటం రాష్ట్ర అభివృద్ధిపట్ల పెట్టుబడుదారుల నమ్మకానికి ప్రత్యక్షసాక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా చేసిన కృషికి విశాఖ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందన్నారు.

ఇళ్ళు ఖాళీ చేయాలని నోటీసులివ్వటం సరికాదు : సీఐటీయూ


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్టీ కుటుంబాల వారు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరంలో దశాబ్దాలుగా నివాసం ఉంటూ చేపలవేట ఆధారంగా జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాలవారికి నివేసన స్థలాలివ్వకుండా అభివృద్ధి పేరిట ఉన్న ఇళ్ళు ఖాళీ చేయమని నోటీసులివ్వటం సరికాదని సీఐటీయూ నాయకుడు కె.శరత్ అన్నారు. బాధిత కుటుంబాలవారితో కలిసి సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాల వారికి నివాసం ఉంటున్న ప్రాంతంలోనే స్థలాలిచ్చి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీను, నాగరాజు, కోటయ్య, మేరీ, ఏసమ్మ, చామంతమ్మ ఉన్నారు.

గొర్రెల పెంపకందారులకు రుణాలిప్పించాలి

జిల్లాలోని గొర్రెల పెంపకందారులకు బ్యాంక్‌రుణాలిప్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రుణాల కోసం అర్జీలు పెట్టి బ్యాంక్‌లు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామన్నారు. అయినప్పటికి సాయం అందటంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి అంజనేయులు, గొర్ల వెంకట్రావు, యర్రాకుల ప్రకాష్, దబ్బకూటి యలమంద, మల్లారపు నరసహరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయాన్ని సాధించాలంటే వైఫల్యాన్ని అంగీకరించాలి

● ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్


మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయాన్ని సాధించాలంటే ముందుగా వైఫల్యాన్ని అంగీకరించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి, ఐఎఫ్ఎస్ అధికారి పి.రాజశేఖర్ తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్న దీక్షారంబ్-2025 7వ రోజు కార్యక్రమానికి నల్గొండ జిల్లా అటవీ శాఖాధికారి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమౌతూ విద్యార్థి విజయపయనంలో గురువులు, కుటుంబసభ్యులు, స్నేహితుల పాత్ర ఎంతోముఖ్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి, డాక్టర్ పి.మధుమతి, డాక్టర్ లాల్ అహ్మద్ మొహ్మద్, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్ ఎం.సంధ్య, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ వి.సీతారాంబాబు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం నూతన విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు నిర్వహించారు.

శిఖరం రామకృష్ణ శతజయంతి ఉత్సవాలకు తరలిరావాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : బాపట్ల పెద్దకర్లం శిఖరం రామకృష్ణారావు శతజయంతి ఉత్సవాలు మంగళవారం శిఖరంవారి వీధిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలలో ఏకాదశ రుద్రాభిషేక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించబడుతుందన్నారు. బాపట్లలోనే ఉన్నత విద్యనందించటానికి ఆనాటి పెద్దల సహకారంతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి పలు కాలేజీలను నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఆయన పుస్తకాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌లపై అమానుషంగా ప్రవర్తిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ప్యానల్ న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రైలుపేట నాల్గవ సచివాలయంలో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు న్యాయవాది కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లకు అత్యవసరమైన సేవలు అందించేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లకు కాల్ చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ అడ్వకేట్ చొప్పకట్ల అంజనేయులు, పారా లీగల్ వలంటీర్లు నల్లమోతు శామ్యూల్ జాన్సన్, సచివాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

హైదర్‌పేట గ్రామంలో....

బాపట్లరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం ఈస్ట్‌బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని హైదర్‌పేట గ్రామంలో సోమవారం వృద్ధుల సంక్షేమ చట్టాలు గురించి న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. బాపట్ల మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్యానల్ అడ్వకేట్ బి.లీలాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ వృద్ధులు వారి సంతానం లేదా చట్టబద్ధమైన వారసుల నుంచి భరణం, సంక్షేమాన్ని పొందేందుకు హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కె.రవిబాబు, ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, నల్లమోతు శామ్యూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాణి పాల్గొన్నారు.

సివిల్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్స్ కోచింగ్ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారితాధికారిణి శివలీల తెలిపారు. ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. దరఖాస్తు చేసుకునే వారు వారి ధ్రువీకరణ పత్రాలతో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 8179042760లో సంప్రదించాలన్నారు.

ఈస్ట్ బాపట్ల పీఏసీఎస్‌లో సహకార వారోత్సవం

బాపట్లరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో భాగంగా ఈస్ట్‌బాపట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందిరాజుతోట సంఘ కార్యాలయ ఆవరణంలో సోమవారం సహకార జెండాను సంఘ చైర్మన్ తాతా హరిశ్చంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.


సహకార సంఘ జెండాను అవిష్కరిస్తున్న ఈస్ట్ బాపట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ తాతా హరిశ్చంద్రప్రసాద్ తదితరులు

జాతీయ రహదార్ల ప్రాజెక్ట్ పనులకు భూసేకరణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల ప్రాజెక్ట్ పనులకు భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం జాతీయ రహదారుల పనుల పురోగతిపై సంబంధితాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెళ్ళే జాతీయ రహదారులు 544జీ, 167ఎ, 16, 544డి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయటానికి కావాల్సిన భూసేకరణలో ఉండే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రహదారుల పురోగతిని మెరుగుపర్చే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. బాపట్లలో రైల్వేట్రాక్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ విషయమై అధికారులను కలెక్టర్ ఆరా తీశారు. భూసేకరణకు సంబంధించి రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి నివేదిక అందజేయాలన్నారు. బాపట్లలో రైల్వేస్టేషన్ పరిసరాల అభివృద్ధికి సంబంధించి స్థల సేకరణ విషయంలో పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రైల్వే అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ల్యాండ్ ఎక్విజిషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, బాపట్ల, చీరాల ఆర్డీవోలు, పి.గ్లోరియా, చంద్రశేఖర్, అద్దంకి, జె.పంగులూరు, చీరాల, పర్చూరు, కారంచేడు తహసీల్దార్‌లు జాతీయ రహదారులు, రైల్వేఅధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బాపట్ల శాఖా గ్రంథాలయంలో సోమవారం డిజిటల్ లైబ్రరీలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎ.శివాజిగణేశన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు పరిసర ప్రాంతాలలోని స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. డిజిటల్ లైబ్రరీ ద్వారా కావాల్సిన సమాచారం త్వరితగతిన తెలుసుకోవచ్చు అన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెంశాఖ గ్రంథాలయం, చందోలు శాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారులు మోర్ల శ్రీనివాసరావు, కొడాలి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-1 ఎస్.వెంకటశివబాబు పాల్గొని గ్రంథాలయ ప్రాధాన్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మాస్టర్ జెసి శ్రీనివాస్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

● అమృతలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని కూచిపూడి గ్రంథాలయాధికారి రామవేంద్రరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, ఎస్ఆర్ రంగనాధన్, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరి సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శాఖా గ్రంథాలయాల్లో దేశభక్తి, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. కొల్లూరు, అనంతవరం శాఖా గ్రంథాలయాల్లో దేశభక్తి గీతాల పోటీలను సచివాలయ సిబ్బంది వెంకటగోపయ్య, మౌనిక, ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ జగదీష్ ప్రారంభించారు. భట్టిప్రోలు శాఖా గ్రంథాలయంలో తెలుగు పద్యాల పోటీలను ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు రమాకుమారి ప్రారంభించారు. ఆయా పోటీలను గ్రంథాలయ అధికారులు వై.రాంబాబు, జి.కనకదుర్గ, కె.సుభాష్‌చంద్రబోస్ పర్యవేక్షించారు.

● చుండూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుండి పిల్లల్లో చదివే అలవాటును తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మండలంలోని గ్రంథాలయ అధికారులు కోరారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సోమవారం వేటపాలెం, యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రతి విద్యార్థి కొంత సమయం గడపటం, అలవాటుగా మార్చుకోవాలని దాని వలన భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు.

పరీక్షల నిర్వహణపై పాఠశాలను సందర్శించిన సంచాలకులు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా ప్రభుత్వ పరీక్షల నిర్వహణ సంచాలకులు కె.శివకుమార్ సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కూటమినాయకులు

పిట్టలవానిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని జుల్నా వీధికి చెందిన బాజీ బేగ్‌కు సంబంధించిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న బాపట్లనియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, రైల్వే బోర్డు మాజీ సభ్యులు ఎస్ఎస్ మోసిన్ నియాజిలు దగ్ధమైన గృహాన్ని పరిశీలించి తమవంతు ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల జనసేన అధ్యక్షుడు హేస్సేన్‌బేగ్ (దాదా), టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, షేక్ రఫీ, సయ్యద్ అన్సారీ, చల్లాపల్లి ఏసోబు, జిడుగు రాజేష్, కూటమినాయకులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు సోమవారం పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం, చందోలు గ్రామటీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, చందోలు-2 నీటి సంఘం, డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, మండల జనసేన అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, టీడీపీ నాయకులు బాజి, సలీం, వీఆర్వో సుభానీ పాల్గొన్నారు.

హిందూపురం ఘటనపై వైసీపీ నాయకుల నిరసన


ప్రదర్శన చేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై చేసిన దాడిని నిరసిస్తూ బాపట్ల జిల్లా వైసీపీ నాయకులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం గురించి జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో నానాటికి దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అండగా ఉంటున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈపూరి గణేష్, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి యార్లగడ్డ మదన్మోహన్‌గౌడ్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, జిల్లా నాయకులు దొంతిబోయిన సీతారామిరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, చల్లా రామయ్య, కూనపురెడ్డి అవినాష్‌నాయుడు, లీలా శ్రీనివాసరెడ్డి, జోగి రాజా, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, అడే చందు, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, బుల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జగన్మోహనరావుకు సేవా రత్న పురస్కారం అందజేస్తున్న సత్యనారాయణ, రవి

జగన్మోహనరావుకు సేవా రత్న పురస్కారం

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కింగ్స్ వే అకాడమీ గ్రాండ్ మాస్టర్ కొక్కిలిగడ్డ జగన్మోహనరావుకు సేవా రత్న పురస్కారం, ఆస్ప జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆస్ప భారత్ వరల్డ్ ఆక్యుపంచరు దినోత్సవం సందర్భంగా విజయవాడ అశోక నగర్ ఇండియన్ హోమ్ కేంద్ర కార్యాలయంలో దేశవ్యాప్తంగా, విశిష్ట సేవలు అందించిన 42 మందికి సేవారత్న, వైద్యరత్న అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావును రేపల్లెలో పలువురు పెద్దలు అభినందించారు.

శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక సోమవారం పూజలు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యలంక సముద్రతీరంలోని ఉన్న శ్రీతారకేశ్వరస్వామి, అన్నపూర్ణదేవి ఆలయంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆకాశదీపోత్సవాన్ని రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుండి ప్రత్యేక రుద్రాభిషేకం, పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని ఎస్ఎస్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వతి వర్దిని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో, శ్రీగంగాపార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.


శ్రీలింగోద్భవస్వామి

● పిట్టలవానిపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో అత్యంత ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రమైన శ్రీలింగోద్భవస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకస్వామి దండిభట్ల శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారని ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ పరిమి రామకృష్ణ సాయిబాబు, త్రిముఖ దేవాలయాల ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి సంయుక్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీచెన్నకేశవస్వామివారి దేవస్థానం చైర్మన్ ఎండూరి సాయిగుప్తా, ఆలయసిబ్బంది, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక మాస శివరాత్రి పూజలు

పిట్టలవానిపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మండలంలోని మంతెనవారిపాలెంలో ఉన్న శ్రీగంగాపర్వతి వర్దిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం కార్తికమాస శివరాత్రి సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

శైవక్షేత్రాల్లో విశేష పూజలు

కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శైవ క్షేత్రాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం చివరి రోజు కావడంతో భక్తులు తెల్లవారుజామున శివాలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. కొల్లూరు అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం విజయవాడ వాస్తవ్యులు చుక్కపల్లి రామకృష్ణ, సుధ దంపతులు ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతి రూపొందించి కార్తీక దీపాలు వెలిగించారు. పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొమ్మూరి వెంకటశివప్రసాద్, గాడేపల్లి శివశర్మ నిర్వహించగా, దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.


అనంత భోగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రూపొందించిన శివలింగాకృతి

సాఫ్ట్ టెన్నిస్‌బాల్ పోటీలలో హైవెండ్ విద్యార్థికి బంగారుపతకం


పఠాన్ హసన్‌ఖాన్‌ను అభిందిస్తున్న ఎండీ సాయి మహేంద్రబాబు

కర్లపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పఠాన్ హసన్‌ఖాన్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నీస్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించాడని మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డు సాయిమహేంద్రబాబు తెలిపారు. శ్రీకాకుళం పాతపట్నంలోని గిరిజా సామాజిక భవనంలో ఈనెల 11, 12, 13వ తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌టెన్నీస్‌బాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పఠాన్ హసన్‌ఖాన్ పాల్గొని అండర్-19 విభాగంలో బంగారు పతకం సాధించాడన్నారు.

స్క్వాష్ పోటీలకు అమృతవర్షిణి ఎంపిక

కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్ విద్యార్థిని పిట్టు అమృతవర్షిణి రాష్ట్రస్థాయి స్క్వాష్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి స్క్వాచ్ పోటీలకు ఎంపికైందని హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు తెలిపారు. హైవెండ్ హైస్కూల్ బాలికలు అండర్ -14లో చందన, వర్షిత, స్వర్ణలత, అమృతవర్షిణి, అండర్-17 బాలుర విభాగంలో వివేక్, అభినవ్, అరుణ, కిషోర్‌లు ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున రాష్ట్రస్థాయి స్క్వాష్ పోటీలలో పాల్గొనగా అమృతవర్షిణి విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. అమృతవర్షిణిని, పీఈటీ వీరశేఖర్‌లను పాఠశాల ప్రాంగణంలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. అభినందించినవారిలో చైర్మన్ ఉదయచంద్రరావు, ఎండి.సాయిమహేంద్రబాబు, డైరెక్టర్‌లు వెంకటజ్యోతి, చాందిని, అంజనేయప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత


లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ.4,43,313 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన ఆకాశం శివన్నారాయణకు రూ.89,928, చావలి భ్రమరాంబకు రూ.23,795, చావలి గ్రామానికి చెందిన గూడెంశెట్టి వరాలుకు రూ.40,184, వేమూరుకు చెందిన వల్లూరి వెంకటప్రసాద్‌కు రూ.42,292, కోడిపర్రుకు చెందిన పులివర్తి మధుమతికి రూ.25 వేలు, పెరవలికి చెందిన గుంటూరు అనిల్‌బాబుకు రూ.22,114 చెక్కులను అందజేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనారోగ్యంతో చికిత్స పొందిన ఆరుగురు లబ్ధిదారులు ఆర్థిక సహాయాన్ని కోరుతూ ఎమ్మెల్యేకు లేఖ రాశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు అందాయి. రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి అర్జీలు స్వీకరించారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామ నివాసి అయిన బొర్రా బిక్షాలుకు అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో య.0.20 సెంట్లు భూమి కలదని సదరు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ , రేపల్లె మండలం కామరాజుగడ్డ గ్రామ నివాసి అయిన కన్నా చంద్రమ్మకి కామరాజు గట్ట గ్రామంలో య.0.53 సెంట్లు భూమి కలగని సదరు భూమిని సర్వే చేసి హద్దులు చూపించవలసినదిగా కోరుతూ ఒక అర్జీ అందినట్లు వారు తెలిపారు.

రుద్రాభిషేక పూజల్లో పాల్గొన్న శివప్రసాద్


చెన్నమల్లయ్యస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న శివప్రసాద్

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం పురస్కరించుకు ఇసుకపల్లి చెన్నమల్లయ్య స్వామి ఆలయంలో జరుగుతున్న రుద్రాభిషేకం పూజల్లో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం శబరిమల వెళుతున్న అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి యాత్ర శుభప్రదంగా సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేజళ్ళ పూర్ణానందం, తాతా ఏడుకొండలు, గుర్రం మురహరిరావు, దండుప్రోలు పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన

భట్టిప్రోలు (కొల్లూరు) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలుపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోలు గురించి దిశా నిర్దేశం చేశారు. ఏవో మాట్లాడుతూ, కోత కోసిన వరి ధాన్యాన్ని తేమ శాతం తగ్గే వరకు ఎండబెట్టుకోవాలని తద్వారా ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తవని చెప్పారు. మండలంలో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ శాంతలక్ష్మి, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడుమైనేని మురళీకృష్ణ సోమవారం తెలిపారు. కొల్లూరు కాలేజీ రోడ్డులోని రైతు సేవ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సివిల్ సప్లయిస్, జీడీసీఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తుమ్మల వారి వంశావళి పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న పావులూరి బాలకృష్ణ, తుమ్మల వంశస్థులు

అమృతలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో తుమ్మల వంశస్థుల సేవలు మరువలేనివని గ్రామ పెద్ద పావులూరి బాలకృష్ణ అన్నారు. మండలంలోని గోవాడ ఎన్టీఆర్ కమ్యూనిటీ భవనంలో బాలకృష్ణ చేతుల మీదగా సోమవారం తుమ్మల వంశావళి పుస్తకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో తుమ్మల వంశస్థులు అధికంగా ఉండేవారని గ్రామ మొదటి సర్పంచ్‌గా తుమ్మల సూర్యనారాయణ రెండుసార్లు పని చేశారని గుర్తు చేశారు. తెలుగు పండితుడు తుమ్మల వెంకటరత్నం గోవాడ గ్రామ చరిత్ర దగ్గుమిల్లి నుంచి గోవాడ వరకు ఆయన రచించారన్నారు. కార్యక్రమంలో తుమ్మల సత్యనారాయణ, తుమ్మల బాలకోటేశ్వరరావు, తుమ్మల లక్ష్మీనారాయణ, తుమ్మల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అవాస్ ప్లస్ పథకంలో నమోదు చేసుకోవాలి

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వం ద్వారా ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులు తప్పనిసరిగా అవాస్‌ప్లస్ 2024 హౌసింగ్ సర్వే చేయించుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ సర్వేలో నమోదైన వారు మాత్రమే రానున్న 4 సంవత్సరాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే గృహ నిర్మాణ పథకంలో అర్హులుగా గుర్తింపబడతారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అర్హులైన గృహ నిర్మాణదారులు ఈ సర్వే పూర్తి చేయించుకునే విధంగా మండల, గ్రామ స్థాయి నాయకులు చూడాలని కోరారు.

లారీ బోల్తా : త్రుటిలో తప్పిన ప్రమాదం

చెరుకుపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగాల బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా పడింది. సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో భీమవరం నుంచి చిన్న గంజాం వైపు రొయ్యల లోడుతో వెళుతున్న ఈ లారీ బోల్తాపడింది. దీంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. చెరుకుపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



వెలలేనివి వీరి సేవలు

● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో, నవమాసాలు మోసి కన్న బిడ్డ మనో వైకల్యంతో పుడితే ఏ తల్లి గుండె బద్దలు కాకుండా ఉంటుంది.. ఆమె గుండె కోతను మాన్పడం ఎవరి తరమౌతుంది. అదుగో అలాంటి కడుపుకోతను ఈ అమ్మలు అనుభవించారు. తమ బిడ్డ అందరిలా లేడని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. కానీ అది తమ సమస్యకు పరిష్కారం కాదని గ్రహించారు. తామే టీచర్లుగా మారి తమ బిడ్డతో పాటు మరెంతోమంది మనోవైకల్యంతో బాధపడుతున్న పిల్లల్లో మార్పు కోసం కృషి చేస్తున్నారు. అమ్మే ఆదిగురువు అని నిరూపిస్తున్నారు. మనోవైకల్యంతో ఉన్న పిల్లలకు వెలలేని సేవలు అందిస్తున్నారు. పట్టణంలోని పెద్ద చెరువులో ప్రత్యేక అవసరాల కోసం ఉన్న ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌లో పట్టణానికి చెందిన కొంతమంది మనోవైకల్యంతో ఉన్న తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి వచ్చారు. తర్వాత తమ బిడ్డకు ఉపయోగపడుతుందని స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొంది, ఇప్పుడు ఇదే పాఠశాలలో టీచర్లుగా చేరి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన చేస్తున్నారు.

అందరూ ఓర్పుతో సేవ చేస్తున్నారు



ఇక్కడ పనిచేసే టీచర్లలో ఎక్కువ మంది అలాంటి పిల్లల తల్లులే. వాళ్ల బాబును చేర్పించడానికి వచ్చి టీచర్లుగా మారారు. మా కాలేజీలోనే వాళ్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ ఇప్పించి టీచర్‌గా రిక్రూట్ చేసుకున్నా. వాళ్ల బాబుతో పాటు ఇక్కడి పిల్లలకు ఎంతో ఓర్పుతో సేవ చేస్తున్నారు. అలాంటి టీచర్లు పది నుంచి పదిహేను మంది దాకా ఉన్నారు.

-ఇందిర, ప్రిన్సిపాల్, ఇంటిగ్రేటెడ్ హైస్కూల్

బాబులో మార్పు వస్తోంది

● శివపార్వతి, టీచర్

మాది మేనరిక వివాహం. బాబు పుట్టిన సంవత్సరం దాకా ఎలాంటి మార్పు లేకపోవడంతో డాక్టర్లకు చూపించాం. డాక్టర్లు సెరిబ్రల్ పాల్సీ అని చెప్పారు. అప్పుడు మేము పడ్డ బాధ పగవాడికి కూడా వద్దు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. దేవుడు మాకే ఎందుకిలా చేశాడని బాధ పడ్డాం. తర్వాత తెల్సినవాళ్లు చెబితే ఇక్కడ చేర్పించాం. నేను డిగ్రీ చదివా. స్పెషల్ ఎడ్యుకేషన్ చేస్తే బాబుకు ఉపయోగపడుతుందని భావించా. ఇప్పుడు ఇక్కడే టీచర్‌గా చేస్తూ మా బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేస్తున్నా. బాబులో మార్పు వచ్చింది. బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.





దేవుని సేవ చేస్తున్నట్లుంది

● వింధ్యారాణి, టీచర్

నా పేరు వింధ్యారాణి. మావారు గవర్నమెంట్ టీచర్. నాకు ఇద్దరు బాబులు. పెద్ద బ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా రెండో అబ్బాయికి సెరిబ్రల్ పాల్సీతో ఎదుగుదల ఆగిపోయింది. మొదట మేం చాలా బాధ పడ్డాం. మెల్లగా బాధను మర్చిపోయి ఇక్కడ చేర్పించాం. నేను ఎమ్మెస్సీ ఎంఈడీ చేశాను. రోజూ మా బాబు కోసం ఇక్కడకు వస్తున్నప్పుడు నేనే స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి నా బాబుతో పాటు ఇంకొంతమంది పిల్లలకు సేవ చేయొచ్చుకదా అనిపించింది. కోర్సు కంప్లీట్ చేసి ఇక్కడే టీచర్‌గా ఉంటూ మా బాబుతో పాటు ఇలాంటి పిల్లలకు బోధిస్తున్నాను. ఇలాంటి పిల్లలకు బోధించడం దేవుని సేవ చేస్తున్నట్లుగా ఉంది.

బాబు కోసం ఫిజియో థెరపిస్టుగా మారా

● కోమలి, అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

మా బాబుకు సెరిబ్రల్ పాల్సీ రావడంతో కదలికలు సరిగ్గా చేయలేకపోయేవాడు. ఫిజియోథెరపీ చేయించడానికి ఇక్కడికి తీసుకొచ్చేదాన్ని. థెరపీ చేయించాక కొంచెం మార్పు కన్పించింది. రోజూ వస్తున్నప్పుడు ఫిజియోథెరపీలో శిక్షణ పొందితే బాబుకు ఉపయోగపడుతుందని, ట్రైనింగ్ పొందా. తర్వాత ఇక్కడే అసిస్టెంట్‌గా చేరా. ఇప్పుడు బాబుతో పాటు మిగతా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్నా. బాబులో మార్పు వస్తుంది.





మల్కాపురం చెరువు కట్ట పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

మల్కాపురం చెరువు ప్రక్షాళన

● ఏడీసీ ఆధ్వర్యంలో పనులు

తుళ్లూరు (మల్కాపురం), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రాజధాని గ్రామం మల్కాపురం చెరువు ప్రక్షాళనకు ఏడీసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఎస్టీ కాలనీ చెంతనే ఈ చెరువు నెలకొని ఉంది. పూర్వం కాకతీయులు కాలంలో రాణిరుద్రమ్మ దేవి ఏలుబడిలో మందడం (మందారం) మల్కాపురం ప్రాంతాలుండేవని చరిత్ర చెబుతోంది. ఇప్పుడు ఉన్న ఎస్టీ కాలనీలో శివాలయం, రాణి రుద్రమ్మ దేవి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా శాసనం ఇప్పటికీ ఉన్నాయి. అక్కడే కోనేరుండేదని చెబుతున్నారు. ఇప్పుడు ప్రక్షాళన చేస్తున్న చెరువే.. ఆ కోనేరని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాలక్రమంలో కోనేరు కాస్త మురుగు చెరువుగా మారింది. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్, పక్కన ఎస్టీ కాలని వాసుల ఇళ్లలోని మురుగు నీరు ఈ చెరువులోకి చేరి దుర్గంధం వెదజల్లుతుండేది. దశాబ్దాల కాలంగా సమస్య అలాగే ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు శివాలయం శిలాశాసనం సందర్శించి చెరువును ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత ఎన్నికల సమయం దగ్గర పడటంతో విషయం మరుగున పడింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మురుగు చెరువు ప్రక్షాళనకు అడుగులు పడ్డాయి. మురుగు నీరు అంతా బయటకు పంపి చుట్టూ కట్టలను బలంగా వేస్తున్నారు. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్ చెరువులోకి రాకుండా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) వారు అమరావతి నగర బ్యూటిఫికేషన్ కింద మల్కాపురం చెరువును ఆహ్లాదకరంగా మలచనున్నారు.

వినుకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

● మరో డాక్టర్‌కు షోకాజ్ నోటీసులు

వినుకొండటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయనను వైద్యశాఖ డైరెక్టర్ చక్రధర్ బాబు సస్పెండ్ చేసినట్లు సోమవారం వైద్యశాల సిబ్బంది తెలిపారు. గతంలో శ్రీనివాసరెడ్డిపై మహిళా డాక్టర్లు పలు ఆరోపణలు చేస్తూ వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ ప్రసూన వినుకొండ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందచేశారు. దాని ఆధారంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. మరొక డాక్టర్ సుధాకర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చారిత్రక శాసనాలపై అధ్యయనం



వెలుగుచూసిన రాగిశాసనాలు

(బాపట్ల, చెరుకుపల్లి-ఆంధ్రజ్యోతి)

చారిత్రక శాసనాలను రక్షించడంతో పాటు వాటిపై అధ్యయనం చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ (మైసూర్) మునిరత్నం రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని అగ్రహారంలో వెలు గుచూసిన రాగిశాసనాల సాఫ్ట్ కాపీ ప్రతులు ఆయా వంశస్థుల దగ్గర నుంచి అందినట్లు ఏఎస్ఐ డైరెక్టర్ ధ్రువీకరించారు. శాసనాలు సంస్కృతం, తెలుగు లిపిలో రాసి ఉన్నట్లు ఆయన వివరించారు. అష్టాంగ ఆయుర్వేద వైద్యం గురించి ఓ శాసనంలో తెలిపినట్లు గుర్తించామన్నారు. వాటిని డీ కోడింగ్ చేయడంపై కసరత్తు జరుగుతోందని, చారిత్రక శాస నాల సమాచారం ఏదైనా అందుబాటులో ఉంటే వెంటనే ఆర్కియాలజీ విభాగానికి తెలపాలన్నారు. త్వరలోనే పొన్నపల్లి గ్రామ అగ్రహారాన్ని పు రావస్తుశాఖ అధికారుల బృందం సందర్శించడంతో పాటు ఆ శాసనాలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరుగుతుందని డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు.

● అగ్రహారానికి చారిత్రక నేపథ్యం

చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్ పూర్వీకులు 14వ శతాబ్దంలో కొండవీడును పరిపాలించిన రెడ్డి రాజుల ఆస్థానంలో వేద పండితులుగా, ఆయుర్వేద వైద్యులుగా సేవలందించారు. కొండపల్లి అగ్రహారాన్ని దానంగా పొందిన వారసుల్లో ఒకరు విద్యాభాస్కర్ కాగా, ప్రస్తుతం రాగి శాసనాలను వెలుగులోకి తెచ్చి వాటిపై అధ్యయనం చేయాలని ఆర్కియాలజీ విభాగాన్ని కోరుతూ వివరాలందించారు. 700 ఏళ్ల తర్వాత కూడా ఆ నాటి రాగి శాసనాలు చెక్కు చెదరకుండా గత వైభవానికి ప్రతీకలుగా నిలవడం గమనార్హం.

సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం



లంకా సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తిరుపతిలోని ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం - ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా చేపట్టిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్ అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పాంధ్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు. గ్రంథాలయానికి, పుస్తక విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాబోయే తరానికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సాహిత్యవేత్తలు కోట పురుషోత్తం, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభీషణ శర్మ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు, లంకా సూర్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

● కార్తికమాసం చివరి సోమవారాన భారీగా తరలివచ్చిన భక్తులు



భక్తులతో పోటెత్తిన పెదకాకాని శివాలయం

అమరావతి/పెదకాకాని/బాపట్ల/నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి సోమవారాన జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పెదకాకాని మల్లన్న సన్నిధికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి, భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగంలో ప్రదక్షిణలు చేసి కార్తిక మాస దీపారాధనలు చేశారు. అనంతరం శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండ ఆలయ ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయం ద్వారా రూ.9 లక్షల 10 వేల ఆదాయం వచ్చిందని ఉపకమీషనర్ తెలిపారు. కాగా, స్వామి వారిని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని దంపతులు దర్శించుకున్నారు.

భక్తజన సంద్రంగా అమరేశ్వరాలయం

కార్తికమాసం చివరి సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు వెలిగించిన కార్తికదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి నదీ తీరంలో కార్తిక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. సాయంత్రం వరకు భక్తుల రాకతో క్యూలైన్‌లు రద్దీగానే ఉన్నాయి. ఆలయంలో ఏర్పాట్లను ఈవో రేఖ పర్యవేక్షించారు.

జనసంద్రంగా సూర్యలంకతీరం

కార్తికమాసం చివరి సోమవారం సూర్యలంకతీరం జనసంద్రంగా మారింది. భక్తులు తెల్లవారుజామునే సముద్రస్నానాలు ఆచరించి సూర్యనమస్కారాలు చేసి ఇసుకతో శివలింగాలు అలంకరించారు. కార్తికదీపాలు వెలిగించి మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, గజఈతగాళ్ళు తీరంలో గస్తీ నిర్వహించారు.

● ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తిక మాస చివరి సోమవారం భక్తు ల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



అమరావతి : క్యూలో బారులు దీరిన భక్తులు

కోటి దీపోత్సవం

రాజధాని అమరావతి నిర్మాణం పూర్తిచేసుకుని వెలుగొందాలని ఆకాంక్షిస్తూ అమరేశ్వరాలయంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హిందూ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జ్ఞానతి, వైష్ణవి, పుణ్యవతి, లక్ష్మీ ప్రణతి కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు.



రోడ్డు ప్రమాదాల అడ్డుకట్టకు ప్రణాళిక

● హైవేపై 12 కీలక ప్రమాద ప్రాంతాలు గుర్తింపు ● ఎన్‌హెచ్‌ఏఐకు నివేదిక ● సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌత్ సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సౌత్ డీఎస్పీ భానోదయ వెల్లడించారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలో 28 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారి ఉందన్నారు. ఇందులో 12 కీలకమైన ప్రమాద ప్రాంతాలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఇందుకు గాను క్షేత్ర స్థాయిలో పర్యటించడంతో పాటు నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అందుకు గల కారణాలను విశ్లేషించామన్నారు. దీనిలో భాగంగా సోమవారం సౌత్ సబ్-డివిజన్ పరిధిలోని నల్లపాడు, ప్రతిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై అధికారుల బృందం సమగ్ర పర్యటన నిర్వహించింది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలు (బ్లాక్‌స్పాట్స్)ను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాద నివారణ చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు ప్రారంభించామన్నారు. ఈ మేరకు ఆయా ప్రమాద స్థలాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే హెచ్చరిక బోర్డులు, సూచిక చిహ్నాలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రమాద ప్రాంతాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారి రూపకల్పనలో అవసరమైన ఇంజనీరింగ్ మార్పులపై సాంకేతిక అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. పాదచారుల భద్రత కోసం పాదచారి మార్గాలు, జీబ్రా క్రాసింగ్‌లు, అవసరమైతే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు పరిశీలించాల్సి ఉందన్నారు. అధిక ట్రాఫిక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరంపై చర్చించారు. ఈ అధ్యయనం ఆధారంగా ఒక ప్రత్యేక సాంకేతిక నివేదికను తయారు చేసి, దాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు సమర్పించనున్నట్లు డీఎస్పీ భానోదయ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా రహదారి భద్రతా చర్యలు మరింత వేగంగా అమలులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి, ఎన్‌హెచ్‌ఏఐ సీనియర్ ఇంజనీర్ దత్తాత్రేయ, నల్లపాడు సీఐ వంశీధర్, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్

సమాజాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

● విశాఖ కో-ఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం

వట్టిచెరుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సహకార సంఘాలు కీలక సేవలు అందిస్తున్నాయని కోఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. భారత ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు భారతీయ సహకార సంఘాల వారోత్సవాలను ప్రకటించిన నేపథ్యంలో.. వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట సమీపంలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కోఆపరేటీవ్ బిల్డ్ ప్రాస్పరిటీ ఫర్ ఆల్ అనే అంశంపై పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ది విశాఖపట్నం కో-ఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ గుంటూరు శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు హాజరై సహకార సంఘాల పాత్రలను వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ సహకార సంఘ బ్యాంకులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు, చిరు వ్యాపారులకు సరళమైన రుణాలు అందిస్తున్న విధానాలను వివరించారు. బ్యాంక్ సిబ్బంది పీజీ విద్యార్థులతో కలసి సహకార సంఘాల వారోత్సవాల లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి కల్యాణ చక్రవర్తి, ఎంబీఏ, ఎంసీఏ అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ది విశాఖపట్నం కోఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులును సన్మానిస్తున్న మలినేని యాజమాన్యం

ఎయిడెడ్ టీచర్ల వివరాలు కోరిన డీఈవో

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసేందుకు అడుగు ముందుకు పడింది. ఎప్పటినుంచో హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఎయిడెడ్ టీచర్ల వివరాలను ప్రభుత్వం కోరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వారి వివరాలను డీఈవో కిరణ్‌కుమార్ కోరినట్లు ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయి ఐడీ, సీఎఫ్‌ఎంఎస్, టీచర్ ఇంటి పేరు, పాఠశాల పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలను డీఈవో కోరారు. నితర వివరాలను గూగుల్ షీట్‌లో వెంటనే డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం పోక్సో యాక్ట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు సాధ్యమైనంత వరకు సమీప బంధువుల ద్వారానో, తెలిసిన వారి ద్వారా జరుగుతాయని అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ద్వారా జీతం పొందేవారు పోక్సో నేరాలలో పాల్గొన్నట్లు తేలితే 20 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువైన శిక్షలు పడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా కలెక్టర్‌కు అవార్డు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాటర్‌షెడ్ పథకంలో పీసీపల్లి మండలం మురుగమ్మి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో లభించిన అవార్డును మంగళవారం కలెక్టర్ రాజాబాబు అందుకోనున్నారు. ఢిల్లీలో మంగళవారం జరగనున్న కార్యక్రమం నేపథ్యంలో సోమవారం కలెక్టర్ బయలు దేరివెళ్లారు. కలెక్టర్‌తో పాటు డ్వామా వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు నిర్వాహకులతోపాటు ఒక విటుడు, ఒక స్త్రీని అదుపులోకి తీసుకున్నట్లు ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలో ఇరువురు మహిళలు, ఒక పురుషుడు కలిసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

భర్త కాపురానికి తీసుకెళ్ల లేదని భార్య ఆందోళన

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశించినా తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ వివాహిత సోమవారం స్థానిక రాజీవ్‌నగర్‌లో ఎన్‌బీకే రెసిడెన్సీలో ఆందోళనకు దిగింది. వివరాలలోకి వెళితే... తన భర్త 20 ఏళ్ల కిందట వివాహం చేసుకొని పిల్లలు పుట్టిన తరువాత ఇంటి నుంచి గెంటివేశాడని బాధితురాలు వాపోతుంది. అదే క్రమంలో తన భర్త చెడు వ్యసనాలకు బానిసై విడాకులకు కోర్టును ఆశ్రయించాడని, కోర్టు.. భార్యాభర్తలు కలిసి కాపురం చేయాలని ఆదేశించింది. మూడునెలలు గడుస్తున్నా తన బిడ్డలను చూపించకుండా కాపురానికి తీసుకెళ్లకుండా మానసిక క్షోభ పెడుతున్నారని ఆందోళనకు దిగారు. ఈమేరకు తాలూకా పోలీసులు బాధితురాలును పిలిచి విచారణ చేపట్టారు.

పి.నాయుడుపాలెంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు వినతి

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పి.నాయుడుపాలెంలో వలసదారుల కుటుంబంలో పిల్లల కోసం సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి మంజూరు చేసినట్లు ఎంఈవో నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీనుంచి 44 మంది విద్యార్థులకు హాస్టల్‌లో సౌకర్యం ఉంటుందని తెలిపారు. నిర్వహణకు ఆసక్తి కల్గిన ఎన్‌జీఓలు, ఎస్‌హెచ్‌జీల నుంచి ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9505032613నంబరులో సంప్రదించాలని కోరారు.

చీమకుర్తిలో వైభవంగా కోటి దీపోత్సవం

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో సాక్షిరామలింగేశ్వరాలయలో కార్తీక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. పరమశివుని చిత్రం చుట్టూ చేసిన దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. మండల పరిధిలోని అన్ని శివాలయాల్లో చివరి కార్తీక సోమవారం నాడు విశేషంగా పూజలు జరిపారు.



సాక్షిరామలింగేశ్వరాలయంలో కోటి దీపోత్సవంలో భక్తులు

మద్దిపాడులో...

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు గంగాధర్ రావు పంతులు ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. ఆరి సురేంద్రబాబు, నరసింహారావులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

సుదర్శన యజ్ఞంతో లోక కల్యాణం

ఒంగోలు నగరంలో తాళ్లపాక హరి నారాయణాచార్యులు పర్యటన

ఒంగోలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులకు(12వ తరం) చెందిన తాళ్లపాక హరినారాయణాచార్యులు సతీసమేతంగా సోమవారం సాయంత్రం ఒంగోలు నగరంలో పర్యటించారు. వారు గడియారం వారి వీధిలోని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి పూజా కార్యక్రమంలో హరినారాయణాచార్యులు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాముడు రాఘవుడు అనే అన్నమాచార్య కీర్తనను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోదండరామ స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనారసింహ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించటం ఎంతో ఆనందదాయకమని, ఇది లోకకల్యాణానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం హరినారాయణాచార్యులును ఘడియారం సుబ్బయ్య శర్మ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి మహంకాళి వెంకటశేషయ్య, కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులు మైనంపాటి సాయికుమార్, భక్తులు పాల్గొన్నారు.


హరినారాయణాచార్యులను సన్మానిస్తున్న దేవస్థాన నిర్వాహకులు

'జడా'కు ఘన నివాళి

నాటి స్మృతులను గుర్తు చేసుకున్న పీఎస్ఎఫ్ శ్రేణులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్ ఫ్రంట్ (పీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత జడా కోటేశ్వరరావు 14వ వర్ధంతిని ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. పీఎస్ఎఫ్ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రంగా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఫ్రంట్ సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ శ్రేణులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, జడా అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, నిబద్ధత, విద్యార్థుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా స్థాపించిన పీఎస్ఎఫ్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. ఒంగోలు శర్మాకాలేజీలో స్టూడెంట్ ఫ్రంట్ ఏర్పాటుతో జడా కోటేశ్వరరావు ప్రతి ఒక్కరి గుండెలో నిలిచిపోయారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎందరో విద్యార్థులకు ఒంగోలులో వసతి కల్పించడంతోపాటు, అండగా నిలవడం, అలాగే వారి సమస్యలు పరిష్కరించడంలో బలమైన స్టూడెంట్ సంఘంగా పీఎస్ఎఫ్ ఎదిగిందని చెప్పారు. ఆయనను స్మరించుకోవడం ద్వారా చాలాఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని, కాలేజీలో గడిపిన మధురస్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరిబాబు, బాచిన చెంచుగరటయ్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ చైర్మన్ ఈదర మోహన్, సీనియర్ నాయకులు నల్లూరి కిషోర్, వైవీ సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, గేనం సుబ్బారావు, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి, కొత్తపట్నం జడ్పీటీసీ సభ్యుడు లంకపోతు అంజిరెడ్డి, ఈదర చిన్నారి, సుల్తాన్ బేగ్ (మస్తాన్), వై.శీనయ్య, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, చలపతి, బచ్చు వీరాంజనేయులు, జడా కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.


జడాకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ఈదర, బాచిన, డాక్టర్ సీతారామయ్య

సదస్సు మొదలు కాకముందే పెట్టుబడుల వరద

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన సీఐఐ గ్లోబల్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ దిశను పూర్తిగా మార్చే చరిత్రాత్మక వేదికగా నిలిచిందని, సదస్సు మొదలు కాకముందే పెట్టుబడి వరద మొదలైందని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెట్టుబడుల ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయన్నారు. 613 ఒప్పందాలు, రూ.13.25,716 కోట్ల పెట్టుబడులు రాకతో 16,13,188 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సదస్సుకు ముందు రోజు ప్రభుత్వం 35 ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమన్యాయం జరిగిందని నూకసాని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని చెప్పారు.


మాట్లాడుతున్న నూకసాని

కాజేసిన పొదుపు సంఘాల నిధులు రాబట్టాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

ఒంగోలు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరంపాడుహరిజనవాడ గ్రామపంచాయతీలో నొక్కేసిన స్వయం సహాయక సంఘాల నిధులు రాబట్టాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పొదుపు మహిళలు అర్జీ సమర్పించారు. ఆ సందర్భంగా స్వయంసహాయక సంఘాల మహిళలు మాట్లాడుతూ నిధులు స్వయం సహాయక సంఘాల నిధులు సుమారు రూ.50లక్షలు ఉండాల్సి ఉంది.. ప్రస్తుతం రూ.5వేలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆ నిధులు నొక్కేయటంలో అప్పటి ఏపీఎం గోపి, సీసీ సాంబయ్యల సహకారంతో కీపర్ దర్శి సుజాతతో కుమ్మక్కై నిధులు దోచుకున్నట్లు తెలిపారు. ఆ నిధులను రాబట్టి స్వయం సహాయక సంఘాల మహిళలు న్యాయం చేయాలని సుజాత, రత్నమ్మ కోరారు.

కుష్ఠు నివారణపై అవగాహన

పొన్నలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నివారణపై స్థానిక సచివాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన మాట్లాడుతూ కుష్ఠును సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు సర్వే కొనసాగుతున్నదని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ రవికిరణ్, వైద్య సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహించిన వైద్య అధికారులు, సిబ్బంది

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ కేవీపీ రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మంగమూరు రోడ్డులోని సుబ్బయ్యనగర్, ఎస్ఎస్‌పీ కాలువ, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్, చంద్రయ్య నగర్, సరస్వతి శిశుమందిర్, ఎన్‌జీవో కాలనీ 7వలైన్‌లలో విద్యుత్తు అతరాయం ఏర్పడుతుందని అన్నారు. వినియోగదారులు గమనించి సహకరిచాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన

కొండపి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల, చాణక్య జూనియర్ కళాశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మర్రిబోయిన శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. అక్కడ వసతులను చూశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆయన ఎంఈవో పి.రామారావుకు సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం సుబ్బారావు, అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ఎంఐఎస్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి సుమిత్ మిగ్ద్ (35) మృతి చెందిన ఘటన మండలంలోని గజ్జలకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ఏఎస్ఐ వెంగళరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం జల్పైగురి జిల్లా భీర్‌పూర్ ప్రాంతానికి చెందిన సుమిత్ మిగ్ద్ మాల్దా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. సహచరులతో కలసి వెల్డింగ్ పనులు చేసుకునేందుకు వాస్కోడిగామా రైలులో బెంగళూరుకు వెళుతున్నాడు. గజ్జలకొండ రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి కేసు న మోదు చేశారు.శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక మోసాలపై మూడు కేసులు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్థిక మోసాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మూడు కేసులు నమోదయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కాలేజీ రోడ్డులోని బజాజ్ ఆటో ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న తర్లుపాడు మండలం బుడ్డపల్లె గ్రామానికి చెందిన దేవెండ్ల శ్రీను రూ.6 లక్షల మేర ఈఎంఐలు వసూలు చేసుకుని కంపెనీకి కట్టలేదు. ఈ విషయమై మేనేజర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నిసార్లు డబ్బులు చెల్లించాలని అడిగినా శ్రీను స్పందించలేదు. దీంతో టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

- ప్రైవేటు చీటీ పాడుకున్న తనకు నిర్వాహకుడు రూ.3.80లక్షల మేర డబ్బులు ఇవ్వడంలేదని పట్టణానికి చెందిన సింగరి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జక్కా శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.
- స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద ఇంటి సమీపంలో నివసించే పాలకేంద్రం నిర్వాహకుడు జంకె కోటిరెడ్డి ఇబ్బందుల్లో ఉండడంతో అవసరానికి ఎవరికీ తెలియకుండా ఇంట్లోని 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు ఇస్తే తనకు తిరిగి చెల్లించలేదని దేవెండ్ల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

రూ.1.35 లక్షలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ జూదరులు పోలీసులకు చిక్కారు. అర్బన్ సీఐ కె.సురేష్ కథనం ప్రకారం... ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.1.35 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.3,17,314 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,02,706, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.76,340, శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం వచ్చినట్లు తెలిపారు. పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు పార్వతి దంపతుల కుమారుడు వెంకట కిశోర్‌బాబు, మానస దంపతులు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.40 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

అవీఇవీ

గ్రామీణాభివృద్ధికి సొసైటీలు పట్టుగొమ్మలు


ప్రతిజ్ఞ చేస్తున్న ఎండీ వేణు, సభ్యులు

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సొసైటీ) గ్రామీణాభివృద్ధికి పట్టుగొమ్మలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మేనేజింగ్ డైరెక్టర్ డి. వేణు తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను సోమవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సహకార పతాకాన్ని ఎండీ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. జోనల్ సహకార విద్యాధికారి జి. శ్రీనివాసరావు, ఒంగోలు సూపర్‌బజారు ఎండీ సురేంద్రకుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీబీఎన్ కుమార్, మారుతి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు కార్యాలయ సిబ్బందిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ భవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ పర్యటన నేపథ్యంలో ఈ ఘటన జరగడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దుంపా రవణమ్మ, పాలడుగు రాజీవ్, భూమిరెడ్డి రవణమ్మ, లంకపోతు అంజిరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, వడ్లమూడి వాణి, పేరం ప్రసన్న, కరుణాకర్, వేముల శ్రీకాంత్, ముల్లంగి రవీంద్రారెడ్డి, పల్నాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ, పట్టణ పథకాలపై చర్చించిన మాగుంట


మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలో కొచ్చిన్‌లో సోమవారం జరిగిన గృహ- పట్టణ పథకాలపై సోమవారం గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంట్ కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమీక్షించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రగృహ- పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థికశాఖ, కొచ్చిన్ స్మార్ట్‌మిషన్‌లిమిటెడ్, గ్రేటర్ కొచ్చిన్ అభివృద్ధి అథారిటీ, కొచ్చిన్ మునిసిపల్ కార్పొరేషన్, కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్, స్టేట్ బ్యాంకు, కెనరా బ్యాంకు, హడ్కో తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. భారత్‌మిషన్-అర్బన్, అమృత్, పీఎం ఆవాస్ యోజన, పీఎంఎస్‌వీఏ నిధి తదితర పథకాలపై చర్చించి అధికారులకు మాగుంట సూచనలు ఇచ్చారు.

మా భూమి మాకు ఇప్పించండి

పీజీఆర్ఎస్‌లో బల్లికురవ రైతుల విజ్ఞప్తి


భూమి అక్రమించారంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బల్లికురవ గ్రామానికి చెందిన రాఘవులు, వీరరాఘవులు, పూర్ణయ్య. సుబ్బారావులకు సంబంధించిన 69సెంట్ల భూమిని అక్రమించిన వారి పేరిట ఆన్‌లైన్ చేసి ఇబ్బంది పెడుతున్నారంటూ సోమవారం పీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ సింగారావు తమ భూమిని జొన్నలగడ్డ మేరమ్మ పేరిట 1బీలో నమోదు చేశారన్నారు. తమ గ్రామానికి చెందిన నాగబోయిన సింగారావు, శ్రీనివాసరావుల మద్దతుతో ఈవిధంగా చేసి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదన్నారు. తమ పూర్వీకులు నుంచి తమకు వచ్చిన భూమిని ఇప్పించి రక్షణ కల్పించాలని దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'మీకోసం'లో రెండు అర్జీలు

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రెండు అర్జీలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వెంటనే భూమికి కొలతలు వేయాలని ఆమె సర్వేయర్లకు సూచించారు.

సీసీఐ పత్తిబంధకాలు!

(5వ పేజీ తరువాయి)

బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో బయట అదే పత్తిని దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంటను వెనక్కి తీసుకెళ్తే.. రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని భావించిన రైతులు.. అయినకాడికి పత్తిని అక్కడే తెగ నమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్వింటాల్ పత్తి రూ.5 వేలకు అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అదే పత్తి సీసీఐ కొనుగోలు చేస్తే రైతుకు క్వింటాల్ కు రూ.రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత) లభిస్తుంది. దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర దక్కేది.

జీవోను అమలు చేయడం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 843 ను సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్ సీఎండీకి లేఖ రాశారు. జీవోలోని 23వ నిబంధన ప్రకారం రైతుల పత్తి పంటను ఇష్టం అయిన చోట అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఐ మాత్రం తాము చెప్పిన చోటే అమ్ముకోవాలని చెబుతోంది. దీనిపై ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు సీసీఐ మేనేజర్‌ను కలిసి రైతుల సౌలభ్యం కోసం జీవోను అమలు చేయాలని కోరినా.. పెద్దగా స్పందించకపోవడంతో తో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

అవీ..ఇవీ..

ధనవృద్ధిపై కళాజాతతో అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ఇంకొల్లు, నవంబరు 17, (ఆంధ్ర జ్యోతి) : జిల్లా సహ కార కేంద్ర బ్యాంకు ఇంకొల్లు బ్రాంచ్ కొణి కి సొసైటీ వారి ఆధ్వర్యంలో ధనవృద్ధి డిపాజిట్ పథకం బంగారంపై రుణాలు, రైతులకు వ్యవసాయ రుణాలు పొందడంపై యడవల్లి చిరంజీవి కళాబృందం కొణికి చుట్టుపక్కల గ్రామాలలో సోమవారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణాలు పొందడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సహకార కేంద్రబ్యాంకు మేనేజరు వి.విజయకుమారి, సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటేశ్వర్లు, సుభాని, సీఈవో మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత

సంతమాగులూరు : టెక్నాలజీ పెరిగే కొద్దీ నేరాలు కూడా పెరుగుతున్నాయని వాటి పట్ల పూర్తిగా అప్రమత్తతో వ్యవహరించాలని సంతమాగులూరు సొసైటీ బ్యాంకు మేనేజర్ ఉమా అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మాలపాడు సొసైటీ పరిధిలోని మక్కెన వారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సైబర్ నేరాలపై లోన్ యాప్ ద్వారా కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. పిల్లల తల్లిదండ్రులకు బ్యాంకు ఖాతాల యొక్క ఉపయోగాలు, పొదుపు రుణాలు, డిపాజిట్లు వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. వి రాజారామ్ కళాజాత బృందం వారి ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు నాయక్, సొసైటీ అధ్యక్షుడు కోయ నరసింహారావు, సీఈవో సునీల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాశీ సైదులు, కోయ శివకోటి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

30న చినగంజాంలో బైబిల్ పరీక్ష

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ పెద్ద చర్చి వద్ద క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 30న ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు బైబిల్ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బ్రదర్ మేకల మేషక్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల స్థాయిలో బైబిల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే వారు 30వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలైన ఐదుగురికి క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9849714691 నంబరును సంప్రదించాలన్నారు.

నిర్ణీత వ్యవధిలో సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ సింగారావు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనన ధృవీకరణ పత్రాల కోసం ఇద్దరు, భూమి కొలతకు సంబందించి ముగ్గురు నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పీఆర్, విద్యుత్ ఏఈలు హనుమంతరావు, ఆంజనేయులు, ఎంఈవో వీరాంజనేయులు, ఏపీవో సంతోషం, హెచ్‌వీ భానుమతి, పలు శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు అందిస్తున్న దాతలు

ఇంకొల్లు, నవంబరు 17,(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా నిరాశ్రయులైన పేదలకు దాతల సహకారం తో దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 20 మంది పేదలకు దుప్పట్లు అందజేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం 25 మంది పేదలకు అన్నదానం నిర్వహిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.

వైప కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లకు ఆహ్వానం

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీలకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఎన్.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు కళాశాలలో నిర్వహణ విభాగాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎల్‌వోసీ మంజూరు

మార్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి):మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన వెలగా అంజమ్మ అనే మహిళకు అత్యవసర వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.40లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరైంది. ఈ మేరకు సోమవారం సెక్రటరియేట్ వద్ద అంజమ్మ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీని ఏలూరి సాంబశివరావు అందచేశారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు సర్వే

మార్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించడం, వారికి సకాలంలో వైద్యం అందించడం, వ్యాధిపై అవగాహన కలిగించడంపై సోమవారం పట్టణంలోని రామ్‌నగర్‌లో వైద్యాధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ కాలనీలోని ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులైనవారు ఎవరైనా ఉన్నారా...? అంటూ విచారించారు. ఈ సందర్భంగా సర్వేకు డీఎస్ఎంవో డాక్టరు మహమ్మద్ సాదిక్, డీపీఎం శ్రీనివాసరావు, ల్యాబ్ సూపర్ వైజరు వెంకటరత్నం, హెచ్ఈవో ఆవుల వెంకటేశ్వరరెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు నర్సరావుపేట మండలం ఉప్పలపాడు, 10 గంటలకు అద్దంకి పట్టణంలోని 8వ వార్డు, 10-30 గంటలకు కాకానిపాలెం, 11 గంటలకు ముప్పవరంలోని వీఎస్ఎన్‌సీసీ హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

బాబోయ్.. దోమలు

- దండుబాట రోడ్డులో అధ్వానంగా పారిశుధ్యం
- పందులు, దోమలు, విషసర్పాలకు ఆవాసాలు
- కన్నెత్తి చూడని అధికారులు



ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ పరిధిలోని దండుబాట రోడ్డులో వ్యర్థ జలాలు, మురుగు నిల్వలతో ప్రజలు విలవిల్లాడు తున్నారు. జనావాసాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు పేట్రేగిపోతున్నాయి. దీంతో దోమలు అవాసాలు ఏర్పాటు చేసుకుని చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే డెంగ్యూ బారినపడి పలువురు రోధిస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్యం సక్రమంగా లేదని, చెత్తసేకరణ అంతంత మాత్రంగానే ఉందని ఆరోపిస్తున్నారు.

ఇళ్లచుట్టూ మురుగు నీటితో అవస్థలు



మా ఏరియాలో ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాము. దోమలు విజృంభిస్తు న్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇటువైపు రావడం లేదు. మా పరిస్థితి పట్టించుకున్న నాధుడు లేడు

కట్టా వెంకటేశ్వర్లు, స్థానికుడు

రోగాలు ప్రబలుతున్నాయి



మురుగుతో అవస్థలు పడుతున్నాము. చిల్లచెట్లతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలి. నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ చేయాలి. ఇక కాలనీలో కొంత కాలంగా అధికశాతం మంది డెంగ్యూ బారిన పడ్డారు. అధికారులు మా సమస్యలు పరిష్కరించాలి.

- కుంభా వెంకాయమ్మ, స్థానికురాలు

ఘనంగా హనుమాన్ సాయి మందిర వార్షికోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడులో ఉన్న హనుమాన్‌సాయి మందిర 19వ వార్షికోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయిమందిరంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక హారతులు, అభిషేకాలను ఏర్పాటు చేశారు. అర్చక స్వామి ఇంకొల్లు మధు, సుధీర్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కబొక్కల పాడు గ్రామంలో పాటు బల్లికురవ, కొత్త పాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, నాగరాజుపల్లి, మల్లాయపాలెం గ్రామాల నుంచి భక్తులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని సాయి బాబాను, అంజనేయస్వామిని దర్శించుకొన్నారు. కార్తీకమాసం కావడంతో మహిళ భక్తులు దేవాలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు సమష్టి కృషితో దాతల సహకారంతో సుమారు రూ. 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు

నక్కబొక్కలపాడు హనుమాన్‌సాయి మందిరంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిపై విశ్వాసంతో పలుమార్లు ఈ దేవాలయంలో సాయి బాబాను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు దేవాలయ కమిటీ సాదర స్వాగతం పలికింది. ప్రతి ఒక్కరు దైవ మార్గంలో ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, నేతలు మలినేని గోవిందరావు, శంకర్, మాలపాటి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంతో ఊరికి విజ్ఞాన వెలుగు



కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితి అభిమానులు

అద్దంకిటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఊరికి వెలుగునిచ్చేదీ, చరిత్ర తెలియజేసేదీ గ్రంథాలయం అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు సోమవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మరో గ్రంథాలయ ఉద్యమం అద్దంకి శాఖ సౌజన్యంతో సృజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గాదేపల్లి దతివాకర్ దత్తు నిర్వహణలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ జ్ఞానదీపం వెలిగించే అమ్మే గ్రంథాలయం, మన దేవాలయం అన్నారు. పుస్తకపఠన అభిరుచి లక్ష్య సాధనకు ఏకైక ఆయుధమని నారాయణం బాల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ సందర్భంగా జన సాహితీ ప్రచురించిన 'కార్యసురుడు-కార్యదక్షుడు', మంచికంటి వెంకటేశ్వరరెడ్డి రచించిన 'సమాజానికి బహిరంగలేఖ' పుస్తకాలను కార్యక్రమానికి హాజరైన వారికి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మన్నం త్రిమూర్తులు గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ వసుంధరదేవి, అన్నమనేని వెంకట్రావు, చుండూరు సుగుణరావు, వారణాసి రఘురామశర్మ, పట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శ్రీమన్నారాయణ, బాబురావు, భువనేశ్వరి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

చీరాల : చీరాలశాఖ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా సోమవారం కవిసమ్మేళనం నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవులు వివిధ అంశాలపై కవిత లను వినిపించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, బీరం సుందరరావు, ఎల్ వెంకట్రావు, హేమ సుందరరావు, ఖాసీం, రూపాదేవీ, ద్రాక్షాయణి, కృష్ణచైతన్య, సుబ్బారావు, ఏకాంబరేశ్వర బాబు, పాల్గొన్నారు.



చీరాలలో కవులను సత్కరిస్తున్న ప్రతినిధులు

చినగంజాం : చినగంజాం శాఖ గ్రంథాల యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు మోహనలక్ష్మినరసింహాచార్యులు అధ్యక్షతన జరిగిన కవి సమేళ్నంలో ఎంఈవో బి.అజయ్‌బాబు మాట్లాడుతూ ఏ బాషలోని సాహిత్యమైన సమాజాన్ని ప్రతిబింబిస్తోం దని అన్నారు. సమాజ పురోగతికి ఉపయోగపడేదే నిజమైన సాహిత్యమని అన్నారు. రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, కవి, వీరేశ్వరశాస్త్రీ, అడవీధిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యులు, యువకవి చుండూరి వెంకట్‌లు తెలుగు గొప్పతనాన్ని తెలిపే సాహిత్యం గురించి వివరించారు. అనంతరం గ్రంథపా లకులు, పాఠకులు ఎంఈవో, కవులను ఘనంగా సన్మానించారు. వెంకట్ పలు సాహిత్య పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు, ఆంధ్రబ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు, బీడీసీఎల్ నిర్వాహకులు, పాఠకులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రఫీ

అద్దంకిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంరక్షణ చట్టం గురించి కుటుంబ సభ్యులు అందరు అవగాహన కలిగి వారిని గౌరవంగా చూసుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం బస్టాండ్ ఆవరణంలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల సంరక్షణ, వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యుల మీద ఉన్నదన్నారు. వారి హక్కులకు భంగం కలిగినప్పుడు వారు ఈ చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంతంగి ధనుంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు





చినగంజాంలోని రామలింగేశ్వరస్వామి, పర్చూరులో పూజలు చేస్తున్న మహిళలు

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి.. కార్తీక మాసం ఆఖరి సోమవారం పరమశివుని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం,లో భక్తులు సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహించారు. మండలంలోని చినగంజాం గంగాపార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుని భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

పర్చూరు : కార్తీక మాసంలో చివరి సోమవారం సందర్భంగా ఆయా శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వేకువజామునే మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పర్చూరు మండలంలోని చెరుకూరు, ఉప్పుటూరు, పర్చూరు, నూతలపాడు, తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అద్దంకి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అద్దంకి : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయాలలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాల గుడి, కమలేశ్వరాలయం, మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. శింగరకొండలోని కోదండరామస్వామి దేవాలయం వద్ద సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఎంపీడీవో రాజేష్‌బాబు



దివ్యాంగ సంఘ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేష్

వేటపాలెం(చీరాల), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో రాజేష్ బాబు తెలిపారు. సోమవారం కార్యాలయంలో 'నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి' రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు విచ్చేసే దివ్యాంగులకు ఏర్పాటు చేయాల్సిన అంశాలపై చర్చించారు. కార్యాలయాల వద్ద ర్యాంపులు. తాగునీరు ఇతర వసతుల గురించి మాట్లాడారు. అలాగే మండలంలో అన్ని కార్యాలయాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సెక్రటరీ చక్రవర్తి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో అక్రమ కట్టడం అడ్డగింత

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ హెచ్చరించారు. ఈక్రమంలోనే సోమవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు సర్వే నెంబర్ 348, 349లో అనధికారంగా రెండవ అంతస్తులో పెంట్‌హౌస్ నిర్మాణం జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే సిబ్బంది సహాయంతో వాటిని నిర్మాణాలను తొలగించారు. బీపీఎస్ నిబంధనలను ధిక్కరిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

వెండికిరీటం అందజేత



వెండి కిరీటం అందజేస్తున్న మేడికొండ మోహనరావు దంపతులు

అద్దంకి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి ఒంగోలుకు చెందిన చెందిన మేడికొండ మోహనరావు, రమాదేవి దంపతులు 1.250 కిలోల వెండి కిరీటాన్ని సోమవారం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. అద్దంకి పట్టణంలోని దామా వారిపాలేనికి చెందిన భక్తుడు రూ.21 వేల విలువైన మోటార్‌ను అందజేశారు. శానంపూడికి చెందిన పలుకూరి వెంకటాచారి రాతి ముఖ మండపానికి రూ.20 వేలను అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను ఆశీర్వదించి, సత్కరించారు.

తల్లిదండ్రులు వేరే పెళ్లిలు చేసుకున్నారని...

- మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం
- చికత్సపొందుతూ మృతి

అద్దంకి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనస్పర్థలతో వేరే వివాహాలు చేసుకోవడంతో మనస్థాపంతో ఎలుకల మందు తిన్న యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని గాజులపాలేనికి చెందిన తిప్పాబత్తిన శేషాద్రి (21) నర్సరావుపేటలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఆయన తల్లిదండ్రులు విడిపోయి వేరే వివాహాలు చేసుకున్నారు. దీంతో శేషాద్రి తాత సుబ్బారావు వద్ద ఉంటున్నాడు. మనస్థాపంతో ఈ నెల 11న ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి ఒంగోలు వైద్యశాలలో, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తాత సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ముప్పవరంలో కార్తీక వనభోజన మహోత్సవం



భోజనాలు చేస్తున్న గ్రామస్థులు

పంగులూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం రాత్రి కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం స్థానిక శివాలయంలో కార్తీకదీపోత్సవం నిర్వహించారు. స్వామివారికి భక్తులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రివేళ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, వారిలో చైతన్యం పెంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు చెప్పారు. ప్రపంచ మూర్ఛ వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూర్ఛ వ్యాధికి గురైన వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూర్ఛ వ్యాధి వచ్చినపుడు వారి చేతిలో తాళాలు పెట్టకుండా బాధితుల నాలుక కొరుక్కోకుండా నోటిలో ఏదైనా గట్టి వస్తువు పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డాక్టర్లు నటరాజ్, ఎస్.హరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు, ప్రభాకర్, సీఎస్ఆర్ఎంవో మాధవీలత పాల్గొన్నారు.